సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 20 । జూన్ । 2024

నేడు 'డయల్ యువర్ డీఎం'
ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం 'డయల్ యువర్ డీఎం' నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగే కార్యక్రమంలో ఫిర్యాదులతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చేవారు 99592 26002 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రిడిటేషన్ గడువు పొడిగింపు
కైలాస్‌నగర్: జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువును ప్రభుత్వం మూడు నెలల పాటు పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఎం.హనుమంత్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్డుల కాల పరిమితి ఈ నెల 30తో ముగియనున్న నేపథ్యంలో జూలై 1నుంచి సెప్టెంబర్ 30వరకు గడువు పొడిగించినట్లు గా డీపీఆర్వో తిరుమల తెలిపారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

విమానాశ్రయ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి


సీఎంకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలను ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ఈమేరకు సచివాలయంలో బుధవారం వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి జిల్లావాసులు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. అలాగే జిల్లాలో చనాఖా–కోర్టాప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి, పట్టణంలో రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి నిధులు విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు, బీజేపీ నాయకుడు సంగప్ప, అశోక్ ఉన్నారు.

కలెక్టర్‌కు సన్మానం


కలెక్టర్ రాజర్షి షాను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ ప్రతినిధులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించి కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా ప్రశంసాపత్రం అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ జరపాలని, వివిధశాఖల్లో పదోన్నతులు కల్పించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంద అశోక్, ఎ.నవీన్ కుమార్, సభ్యులు తిరుమల్‌రెడ్డి, అరుణ్‌కుమార్, ప్రశాంత్ ఠాకూర్, చంద్రశేఖర్, సుజాత, సుమిత్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యదర్శిని కలిసిన బోథ్ ఎమ్మెల్యే


వెంకటేశంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సచివాలయంలో కలిసి నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై చర్చించారు. త్వరగా ఖాళీలు భర్తీ చేసి గిరిజన బిడ్డలకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని కోరారు. అలాగే పలు పాఠశాలల భవనాల కోసం కోరగా, కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మెరిట్ జాబితా విడుదల
ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం పరిధిలో గల పలు పోస్టుల భర్తీ కోసం ఇది వరకే నోటిఫికేషన్ జారీ చేశారు. ఈమేరకు మెరిట్ జాబితాను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ బుధవారం విడుదల చేశారు. ఇందులో కోల్డ్ చైన్ మేనేజర్ పోస్టు ఒకటి, మెడికల్ ఆఫీసర్ పోస్టులు నాలుగు, ఒక ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టు, 26 స్టాఫ్‌నర్సులు, ఒక కమ్యూనిటీ నర్సు, ఒక ఫిజియోథెరపిస్ట్, ఒక డాటా ఎంట్రీ అకౌంటెంట్, ఒక డీపీసీ మేనేజర్, ఒక సైకాలజిస్ట్, ఫార్మాసిస్టు 3, రేడియోగ్రాఫర్ 1, ఎంపీహెచ్‌ఏ 13 పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితా విడుదల చేశారు. కలెక్టర్ సమక్షంలో నియామకాల ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

టూటౌన్ ఎస్సై ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్డ్
ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్‌నాయక్‌ను ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయనను టూటౌన్ నుంచి రిలీవ్ చేసి, ఏఆర్ హెడ్‌క్వార్టర్ రిజర్వు ఇన్‌స్పెక్టర్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.


మోడల్ స్కూల్ విద్యార్థులు (ఫైల్)

మోడల్..!

- ఆదర్శ పాఠశాలల్లో ఏళ్లుగా భర్తీకాని పోస్టులు
- పలుచోట్ల ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లే..
- 12 ఏళ్లుగా ఒకే చోట ఉపాధ్యాయుల విధులు
- వెక్కిరిస్తున్న 'నాన్ టీచింగ్' ఖాళీలు
- కనిపించని మౌలిక వసతులు
- విద్యార్థుల చదువులపై ప్రభావం

ఆదిలాబాద్‌టౌన్: పేరులో ఉన్న ఆదర్శం నియామకాలు, సౌకర్యాల్లో కానరావడం లేదు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోగా, మౌలిక వసతులూ కరువై ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో ఆరు మోడల్ స్కూళ్లలో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. పాఠశాలలు ప్రారంభించినప్పుడు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించారు. ఆ తర్వాత ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. మరోవైపు ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు ఉండగా.. పర్యవేక్షణ కొరవడి విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతుంది. ఖాళీల స్థానంలో తాత్కాలిక టీచర్లను నియమిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఒకే చోట 12 ఏళ్లుగా విధులు నిర్వహించడంతో పాఠశాలల్లో అప్పుడప్పుడు ఉపాధ్యాయుల మధ్య గొడవలకు దారి తీస్తున్నాయి. గతేడాది బదిలీల కోసం ఉపాధ్యాయుల నుంచి ఆప్షన్లు తీసుకున్నప్పటికీ కోర్టు కేసు కారణంగా ప్రక్రియ ముందుకు సాగలేదు.

12 ఏళ్లుగా ఒకేచోట విధులు..

మోడల్ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులు నియామకం అయినప్పటి నుంచి బదిలీలు జరగలేదు. ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారి మధ్య అప్పుడప్పుడు గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు తమ ఊరికి దగ్గరగా ఉండే పాఠశాలలకు బదిలీపై వెళ్లాలని అనుకుంటున్నప్పటికీ 12 ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. గతేడాది బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఉపాధ్యాయుల నుంచి ఆప్షన్లు తీసుకున్నప్పటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగడంలేదు.

ఖాళీలు ఇలా..

జిల్లాలో ఆరు మోడల్ స్కూళ్లను 2013లో ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఆంగ్ల మాధ్యమంలో బోధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడ, బజార్‌హత్నూర్, జైనథ్, నార్నూర్, గుడిహత్నూర్, బోథ్‌లో ఇవి కొనసాగుతున్నాయి. 6 నుంచి 12 తరగతుల వరకు విద్యాబోధన చేస్తున్నారు. పదో తరగతి వరకు 500 మంది విద్యార్థులను, ఇంటర్‌లో 320 మందికి ఇందులో విద్యాబోధన చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. పేరులో ఉన్న ఆదర్శం ఖాళీల భర్తీ విషయంలో కానరావడం లేదు. బంగారిగూడ, నార్నూర్‌లో మాత్రమే రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు ఉన్నారు. మిగతా నాలుగు పాఠశాలల్లో ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు. బంగారిగూడ పాఠశాలలో ఒక పీజీటీ పోస్టు ఖాళీగా ఉంది. బజార్‌హత్నూర్‌లో రెండు పీజీటీ, మూడు టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే జైనథ్‌లో 4 పీజీటీ, 3 టీజీటీ, నార్నూర్‌లో 13 పీజీటీ, 4 టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుడిహత్నూర్‌లో 12 పీజీటీ, 5 టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బోథ్‌లో 13 పీజీటీ, 6 టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 120 పోస్టులకు గాను 66 పోస్టులు ఖాళీగా ఉండగా, 54 మంది ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. కాగా ఖాళీలతో ఇబ్బందులు ఉండగా, జైనథ్‌లో పనిచేసే సీనియర్ ఉపాధ్యాయుడికి గుడిహత్నూర్ పాఠశాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బజార్‌హత్నూర్‌లో పనిచేసే మరో ఉపాధ్యాయుడిని బోథ్‌కు తీసుకెళ్లి ప్రిన్సిపాల్ బాధ్యతలు కట్టబెట్టారు.

నాన్ టీచింగ్ సిబ్బంది కరువు..

మోడల్ స్కూళ్లలో రెగ్యులర్ నాన్‌టీచింగ్ సిబ్బంది నియామకాలు కరువయ్యాయి. అవుట్ సోర్సింగ్ పద్ధతిపై ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒక స్వీపర్ మాత్రమే పనిచేస్తున్నారు. అలాగే తాత్కాలికంగా పీఈటీని నియమించారు. పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బంది లేకపోవడంతో ఉపాధ్యాయులే ఈ పనులను నిర్వహిస్తున్నారు. పనిభారంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

మోడల్ స్కూళ్లలో ఖాళీలున్నప్పటికీ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం. అవర్లీ బేస్డ్ టీచర్లను నియమించి పాఠాలు బోధించేలా చూస్తున్నాం. గతేడాది బదిలీలకు సంబంధించి ఆప్షన్లు తీసుకున్నప్పటికీ కోర్టు కేసు కారణంగా ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఆరు మోడల్ స్కూళ్లలో ఇద్దరు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు ఉన్నారు. 66 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. –ప్రణీత, డీఈవో

ఇక బదిలీల ప్రక్రియ..

- ఉపాధ్యాయ ఖాళీల జాబితా సిద్ధం చేస్తున్న విద్యాశాఖ


ఖాళీల వివరాల జాబితా సిద్ధం చేస్తున్న విద్యాశాఖ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల పదోన్నతులు ముగియడంతో విద్యాశాఖ అధికారులు బదిలీలపై దృష్టి సారించారు. గతేడాది సెప్టెంబర్‌లో నిలిచిపోయిన ఎస్జీటీ, భాష పండిట్‌లు, పీఈటీల బదిలీల ప్రక్రియ కోసం కసరత్తు చేస్తున్నారు. ఖాళీల జాబితాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఒక్కో కేటగిరికి సంబంధించి ఐదుగురు ఉపాధ్యాయులకు ఒకే స్థానంలో ఇద్దరు చొప్పున పోస్టింగ్ ఇవ్వడంతో ఆ పోస్టులను భర్తీ చేసిన తర్వాత ఖాళీలను ప్రకటించనున్నారు. సీనియారిటీ జాబితా రూపొందించిన తర్వాత ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు సంబంధించి దాదాపు వారం రోజులు పట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే బదిలీలకు సంబంధించిన స్పౌజ్ కేటగిరిని ఉపయోగించుకునే ఉపాధ్యాయులు తమ స్పౌజ్‌కు దగ్గరగా ఉన్న పాఠశాలను ఎంచుకోవాలని డీఈవో ప్రణీత సూచించారు. సమీపంలో ఖాళీలు లేనట్లయితే పక్క మండలంలోని పాఠశాలను ఎంచుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే సీసీఏ రూల్స్ ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎనిమిదేళ్లలోపు ఇది వరకే స్పౌజ్ కేటగిరి వినియోగించుకున్న వారు మళ్లీ వినియోగించుకునేందుకు ఆప్షన్ ఇచ్చుకుంటే వారిపైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రాధాన్యత కేటగిరి సర్టిఫికెట్ల పరిశీలన

ప్రాధాన్యత కేటగిరికి సంబంధించి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులు గురువారం రిమ్స్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవాలని డీఈవో తెలిపారు. విషయాన్ని ఉపాధ్యాయులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

- జహీర్ రంజానీకి వ్యతిరేకంగా 34 మంది కౌన్సిలర్లు
- కలెక్టర్‌కు సంతకాలతో కూడిన నోటీసు అందజేత
- అవిశ్వాసంలో కాంగ్రెస్ కౌన్సిలర్‌దే ప్రధానపాత్ర


కలెక్టర్‌కు అవిశ్వాసలేఖను అందజేస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కైలాస్‌నగర్:ఆదిలాబాద్ మున్సిపల్‌లో అవిశ్వాస అంశం రాజకీయంగా కలకలం రేపుతోంది. ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై కౌన్సిలర్లు పార్టీలకతీతంగా అవిశ్వాసం ప్రకటించారు. 34 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస నోటీసును కలెక్టర్ రాజర్షి షాకు తన కార్యాలయంలో బుధవారం అందజేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోయినప్పటికీ ఆదిలాబాద్ మున్సిపల్‌లో మాత్రం గులాబీ పార్టీ తన పట్టు కొనసాగిస్తోంది. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి జోగు రామన్న తనయుడు ప్రేమేందర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా అదే పార్టీ నుంచి వైస్ చైర్మన్‌గా ఎన్నికైన జహీర్ రంజానీ ఇటీవల బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచే పెద్ద ఎత్తున చర్చ సాగింది. రంజానీని ఎలాగైనా పదవి నుంచి దించాలని భావిస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మూడు రోజులుగా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వైస్‌చైర్మన్ పదవి ఆశిస్తున్న అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ ఇందులో ప్రధానపాత్ర పోషిస్తున్నట్లుగా తెలుస్తోంది. దీంతో సదరు కౌన్సిలర్..బీజేపీ, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల మద్దతు కూడగట్టారు. రెండు రోజులుగా ఆయా పార్టీల కౌన్సిలర్లను సంప్రదించి వారితో మంతనాలు జరిపి వారి సంతకాలు సేకరించడంలో సఫలీకృతుడయ్యాడు.

34 మంది సంతకాలు..

బల్దియాలో చైర్మన్‌తో కలిపి మొత్తం 49 మంది కౌన్సిలర్లు ఉండగా వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసానికి అనుకూలంగా మొత్తం 34 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. ఇందులో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 22 మంది, బీజేపీ కౌన్సిలర్లు 8 మంది సంతకాలు చేశారు. వారితో పాటు అధికార కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కౌన్సిలర్లు సైతం మద్దతుగా సంతకాలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అవిశ్వాసం నెగ్గాలంటే 33 మంది కౌన్సిలర్ల మద్దతు మాత్రమే అవసరం. అందుకంటే ఒక కౌన్సిలర్ అదనంగా ఉండటంతో ఎలాగైనా అవిశ్వాసం నెగ్గుతామని నోటీసు అందజేసిన అనంతరం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు వెల్లడించారు. త్వరలోనే సమావేశ నిర్వహణ తేదీని ప్రకటించి అవిశ్వాస ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్‌ను కోరినట్లుగా వారు తెలిపారు. అయితే అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన సంఖ్యాబలంలో కేవలం ఒక కౌన్సిలర్ మాత్రమే అధికంగా ఉండటంతో ఇది నెగ్గుతుందా..వీగిపోతుందా అనే అంశంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు ఆ పార్టీని వీడారు. పట్టణంలోని వార్డు నంబర్–36 (రవీంద్రనగర్ కాలనీ) కౌన్సిలర్ గండ్రత్ రాజేందర్, వార్డునంబర్–2 (మహాలక్ష్మివాడ, చిల్కూరి లక్ష్మీనగర్) కౌన్సిలర్ సంద నర్సింగ్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన 23వ వార్డు తాటిగూడ కాలనీ మాజీ కౌన్సిలర్ సంజయ్, దీపాయిగూడకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు చిన్నయ్య ఆ పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు భోజా రెడ్డి, శంకరయ్య, సుధాకర్‌గౌడ్, రాజలింగు, ఖయ్యుమ్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన కౌన్సిలర్లను సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

'సికిల్‌సెల్'ను అరికడదాం

- కలెక్టర్ రాజర్షి షా


కరపత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌టౌన్: సికిల్‌సెల్ వ్యాధి భావితరాలకు వ్యాప్తి చెందకుండా అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ సికిల్‌సెల్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆడిటోరియంలో బుధవారం ప్రత్యేక అవగాహన, వ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రక్త పరీక్షలు చేయించుకున్నారు. సికిల్‌సెల్‌పై అవగాహన కల్పించేలా ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మూడు విడతలుగా 57,392 మందికి రక్త పరీక్షలు చేయగా 32 మందికి వ్యాధి నిర్ధారణ అయినట్లుగా తెలిపారు. 988 మంది క్యారియర్లుగా ఉన్నారని పే ర్కొన్నారు. వ్యాధి వచ్చిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే క్యారియర్లుగా ఉన్న వారు మరో క్యారియర్‌ను పెళ్లి చేసుకుంటే పుట్టబోయే పిల్లల్లో 70 శాతం వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు వివాహానికి ముందు రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్, ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐవోవైసీ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1–19ఏళ్లలోపు పిల్లలు 2,21,141 మంది ఉన్నారని, ఇందులో అంగన్‌వాడీ కేంద్రాల్లో 42,671 మంది, బడిబయట 1,454 మంది ఉన్నారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో 1,72,310మంది ఉన్నట్లుగా పేర్కొన్నారు. వీరందరికీ గురువారం అల్బెండజోల్ మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. నులిపురుగులవల్ల చిన్నారుల్లో ఎదుగుదల లోపం, బుద్ధిమాంద్యం, చదువుపై శ్రద్ధ చూపకపోవడం, పోషక విలువలు లేక అనారోగ్యం బారిన పడటం, రక్తహీనత వంటి సమస్యలు ఏర్పడుతాయన్నారు. వీటి నివారణ కోసం అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో కలెక్టర్ రాజర్షి షా నేడు ప్రారంభిస్తారని తెలిపారు. రెండేళ్లలోపు చిన్నారులకు సగం టాబ్లెట్, ఆపై వయస్సు కలిగిన వారికి ఒక టాబ్లెట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు అందించేలా చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో డీఐఓ వైసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మరింత 'మద్దతు'

- క్వింటాల్‌కు రూ.500 పెంపు
- కనీస మద్దతు ధరలు ప్రకటించిన కేంద్రం
- వరికి నామమాత్రమే..

మంచిర్యాలఅగ్రికల్చర్/ఆదిలాబాద్‌టౌన్: వానాకాలం సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర పెంచుతూ రైతులకు తీపి కబురు అందించింది. 14పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు పెంచుతూ బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరి, సోయాబీన్, కంది పంటలు అధికంగా సాగవుతుండగా.. పెంచిన ధరలు సోయాబీన్, కంది పంటలకు కాస్త ఊరటనివ్వగా వరి పంట ధర రైతులను నిరాశకు గురి చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 17.20లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. అధికంగా తృణధాన్యాలు, నువ్వు, పెసర పంటలకు ధర పెంచారు. కమిషనర్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(సీఏసీపీ) సూచించిన ధరలు సాగుకయ్యే ఖర్చు కన్నా తక్కువగానే ఉన్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు అనుగుణంగా ధరలు పెంచాలని కొద్ది రోజుల క్రితం సీఏసీపీకి విజ్ఞప్తి చేశారు. రైతు కమిటీల సిఫారసుల ప్రకారం సాగుకు చేసే ఖర్చుకు అదనంగా మరో 50 శాతం కలిపి ధర ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ఆయా పంటలకు రూ.117 నుంచి రూ.983 వరకు ధరలు పెరిగాయి. ఈ ఏడాదైనా పత్తికి క్వింటాల్‌కు రూ.8వేలు, వరికి రూ.3వేలు, సోయాకు రూ.6వేల వరకు చెల్లించాలని పలు రైతుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

సాగు భారం

విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు, కూలీల ఖర్చు, వ్యవసాయ యంత్రాల ధరలు, ఇంధన ధరలు రెట్టింపు అయ్యాయి. వివిధ రకాల పంట సాగుకు పెట్టుబడులు వేలకు వేలు పెరుగుతూ వస్తున్నాయి. పత్తి పంటకు ఎకరాకు రూ.43 వేల వరకు, వరి, సోయా పంటలకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. సాగుకు సకాలంలో బ్యాంకు రుణాలు అందక అప్పు చేసి వేలల్లో నష్టపోతున్నారు. కనీసం కొద్ది పాటి దిగుబడి వచ్చినా పంటలకు ప్రభుత్వాలు మద్దతు ధరలతో రైతుకు అండగా నిలవడం లేదు. ఉమ్మడి జిల్లాలో 5.30 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు, మరో 55 వేల మంది కౌలు రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. 70 శాతం వర్షధారం పైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈ ఏడాదైనా దిగుబడి వచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఆశించిన రైతులకు మరోసారి నిరాశే ఎదురైంది.

రెండేళ్లలో పెరిగిన ధరలు

పత్తి సాగుకు రూ.35,000 నుంచి రూ.43,000, సోయాకు రూ.26,000 నుంచి రూ.30,000 వరకు, వరికి రూ.25,000 నుంచి రూ.32,000 వరకు పెట్టుబడి పెడుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. పెట్టుబడి ఖర్చులతో పోల్చుకుంటే మద్దతు ధరలు ఏమాత్రం సరిపోవని పేర్కొంటున్నారు. గతంలో దుక్కి దున్నడానికి ట్రాక్టర్‌కు గంటకు రూ.700 ఉండగా పెరిగిన డీజిల్ ధరలతో ప్రస్తుతం రూ.1000, ఒక మనిషికి కూలి రూ.400 ఉండగా ఇప్పుడు రూ.600 తీసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు పెరిగాయి.

పెరిగిన ధరలు(రూ.లలో) క్వింటాల్‌కు ఇలా

పంట	గతేడాది	ఈ ఏడాది	పెరిగింది
పత్తి	7,020	7,521	501
వరి(ఏ గ్రేడ్ రకం)	2,183	2,300	117
కంది	7,000	7,550	550
పెసర	8,558	8,682	124
సోయాబీన్	4,600	4,892	292
నువ్వులు	8,365	9,267	632
మొక్కజొన్న	2090	2,225	135
వేరుశనగ	6,377	6,783	406
జొన్న	3,225	3,416	191
మినుము	6,950	7,400	450
పొద్దుతిరుగుడు	6,760	7,400	450

రూ.8 వేలు ఉంటదనుకున్నా..



పత్తి సాగుకు ఏటికేటా వేలకు వేలు పెట్టుబడి పెరిగిపోతోంది. మద్దతు ధర ఏదో నామ్‌కే వాస్తే అన్నట్లు రూ.100, రూ.200 పెంచుతున్నారు. కూలీల ఖర్చు, ట్రాక్టర్‌కు డీజిల్ ధరలు పెరిగాయి. ఈ ఏడాది రూ.8 వేలు పైన ఉంటుందని అనుకున్నా. కానీ రూ.200 పెంచిన్రు. ఇప్పటికైనా పునరాలోచించి ధరలు పెంచాలి. – భీమరాజుల వెంకన్న, నెన్నెల

ఈ ధరలు నిరాశే..

గతంలో కూలీకి రూ.400 ఇస్తే అచ్చేటోళ్లు. ఇప్పుడు రూ.700 ఇస్తేగానీ రావడం లేదు. విత్తనాలు, ఎరువుల ధరలు బాగా పెరిగిపోయాయి. పది ఇరువై పెంచుతున్నరు. వేలకు వేలు పంటకు ఖర్చు అయితంది. గీ ధరలు గిట్టుబాటు కావు. –పి.మురళి, హాజీపూర్

క్లుప్తంగా

24న ఐటీడీఏ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న పుర్క బాపురావు

నేరడిగొండ: ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. షెడ్యూల్డు ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నం.3ను యథావిధిగా కొనసాగించడంతో పాటు ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే పోడు రైతులకు పట్టాలు తదితర డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ధర్నాలో ఆదివాసీ తొమ్మిది తెగల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు కోటేశ్వర్, హన్మంత్‌రావు, వినోద్, గణేశ్ తదితరులున్నారు.

యూపీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం



పల్సిబిలో సన్మానిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సైన్స్‌లో 131వ ర్యాంకు సాధించిన పల్సిబి గ్రామానికి చెందిన సాయి చైతన్య జాదవ్‌ను బుధవారం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు యాదవ్ కిషన్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షలో చైతన్య జాదవ్ ర్యాంక్ సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువు తిని ఐదు మేకలు మృతి



మృతిచెందిన మేకలు

భైంసారూరల్: మండలంలోని సిరాల గ్రామంలో కాంప్లెక్స్ ఎరువు తిని ఐదు మేకలు మృతిచెందాయి. వివరాలు.. బుధవారం సిరాల గ్రామానికి చెందిన వాగ్మారే దిలీప్ మేకల మందను తీసుకుని గ్రామ శివారులోకి వెళ్లాడు. పక్కనే ఓ పొలంలో వాడి పారేసిన కాంప్లెక్స్ ఎరువును మేకలు తిన్నాయి. దీంతో ఐదు మేకలు మృతిచెందాయి. ఐదు మేకలు మృతి చెందగా రూ.60వేల మేరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరాడు.

జప్తు చేసిన వాహనాల వేలం

భైంసాటౌన్: పలు నేరాల్లో జప్తు చేసిన వాహనాలకు భైంసా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో జిల్లా అధికారి రజాక్ సమక్షంలో ఒక కారు, మూడు ద్విచక్ర వాహనాలకు వేలం వేశారు. దీంతో రూ.70వేల ఆదాయం సమకూరినట్లు సీఐ నజీర్ హుస్సేన్ తెలిపారు.

గ్యాస్ సబ్సిడీ.. నో!



భీంపూర్ మండలం తాంసి-కే గ్రామానికి చెందిన ఈమె పెందూర్ మౌనిక. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత రెండుసార్లు వంట గ్యాస్ సిలిండర్లు తీసుకుంది. అయితే ఈమె ఖాతాలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రాయితీ సొమ్ము జమ కాలేదు. గ్యాస్ ఏజెన్సీతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించినా ప్రయోజనం లేకుండా పోయింది.



ఈ చిత్రంలోని కనిపిస్తున్నది బిర్కుర్‌వార్ సుజాత. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ కాలనీవాసి. రెండు నెలలుగా వంట గ్యాస్ సిలిండర్లు తీసుకున్నప్పటికీ ఈమె ఖాతాలోనూ సబ్సిడీ జమకాలేదు. బ్యాంకులో సంప్రదించగా ప్రజాపాలన దరఖాస్తు కేంద్రంలో వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలో వివరాలు అప్‌డేట్ చేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ రాయితీ జమ కాకపోవడం గమనార్హం.


ఈ ఇద్దరే కాదు.. మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ సిలిండర్లు పొందిన జిల్లాలోని వేలాది మంది లబ్ధిదారులది ఇదే పరిస్థితి.

- ఖాతాల్లో జమకాని రాయితీ
- 'మహాలక్ష్మి' లబ్ధిదారుల ఆందోళన
- బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు
- సవరణలు చేసుకున్నా కలగని ప్రయోజనం

కైలాస్‌నగర్: గతేడాది(2023) డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారందరికీ రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ప్రకటించింది. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి రాయితీ సిలిండర్ అందజేయాలని గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలు సైతం జారీ చేసింది. దీంతో అర్హులైన వేలాది మంది సంబంధిత ఏజెన్సీల నుంచి సిలిండర్లు పొందుతున్నారు. ఇందులో చాలామంది బ్యాంకుఖాతాల్లో రాయితీ జమ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డేటా అప్‌డేట్ చేసుకున్నా అందని రాయితీ

మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారి ఎంపిక కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించింది. సబ్సిడీ సిలిండర్ కోసం జిల్లా వ్యాప్తంగా 2.5లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. వీటిని ప్రభుత్వం ప్రజాపాలన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయించింది. అయితే ఆ సమయంలో ఆపరేటర్లు వివరాలను సరిగా నమోదు చేయకపోవడం, లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్, ఆధార్ వివరాలు సరిగా అందించకపోవడంతో



చాలా మంది ఈ పథకం కింద లబ్ధి పొందలేకపోయారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అలాంటి వారు వివరాలు సరిచేసుకునేందుకు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో లబ్ధి చేకూరని వారంతా ఈ కేంద్రాల వద్ద బారులు తీరారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసి వివరాలు సరిచేసుకున్నారు. అయినప్పటికీ వేలాది మందికి రాయితీ ఖాతాల్లో జమకావడం లేదని పేర్కొంటున్నారు.

సవరణలకు నో ఛాన్స్

ప్రజాపాలన కింద కొత్తగా దరఖాస్తు చేసుకుందామని భావించిన వారికి ప్రస్తుతం నిరాశే ఎదురవుతుంది. ప్రజాపాలన వెబ్‌సైట్‌ను జనవరి 6 తర్వాత నిలిపివేసిన ప్రభుత్వం తిరిగి తెరువలేదు. ఫలితంగా కొత్త దరఖాస్తుల స్వీకరణకే పరిమితమవుతున్నారే తప్ప వాటిని ఆన్‌లైన్ చేసే అవకాశం లేకుండా పోతోంది. అలాగే దరఖాస్తు సమయంలో తప్పుగా నమోదైన వివరాలు సైతం సరిచేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ కారణాలతో చాలామంది ప్రయోజనం పొందలేకపోతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

ఉసురు తీసిన అప్పు

- రుణం ఇచ్చిన వ్యక్తితో వాగ్వాదం
- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

తానూరు: అవసరం కోసం స్నేహితుడి వద్ద తీసుకున్న అప్పే ఉసురుతీసింది. ఈ ఘటన మండలంలోని మొగ్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగ్లి గ్రామానికి చెందిన జోడిదండి శివాజీ (31) అదే గ్రామానికి చెందిన జరికోటి శివరాజ్ వద్ద కొంతమొత్తం అప్పుగా తీసుకున్నాడు. అప్పు



శివాజీ (ఫైల్)

తీర్చే విషయంలో మంగళవారం రాత్రి ఇద్దరిమధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శివాజీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శివరాజ్ కొట్టి అవమానించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య సురేఖ బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సర్సాపూర్(జి): మండలంలోని గుండంపల్లి ఎక్స్ రోడ్డు సమీపాన 61వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన అద్దెకార్ క్రాంతికుమార్ (30) శ్రీకృష్ణ న్యూరో ఆస్పత్రిలో పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. పని



క్రాంతికుమార్ (ఫైల్)

నిమిత్తం బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి లోకేశ్వరం మండలానికి వెళ్తుండగా సర్సాపూర్(జీ) మండలం గుండంపల్లి ఎక్స్ రోడ్డు సమీపంలో 61వ జాతీయ రహదారిపై భైంసా నుంచి నిర్మల్ వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడైన క్రాంతికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు బత్తుల నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై 'ఎక్సైజ్' దాడులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి, కైరిగూడ గ్రామాల పరిసరాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటు చేసిన గుడుంబా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. బెల్లం పానకం ధ్వంసం చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గోలేటి, కైరిగూడ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్థావరాలపై దాడులు చేసి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా, అనుమతి లేకుండా మద్యం అమ్మకాల గురించి సమాచారం ఉంటే సమాచారం అందించాలని సీఐ దీపక్ కోరారు. కార్యక్రమంలో



స్వాధీనం చేసుకున్న గుడుంబా తయారీ సామగ్రి

ఎస్సైలు రమేశ్, సంధ్యారాణి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజేశ్వర్, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు సురేశ్, కమలాకర్, మమత, రజిత, ధను, నవీన్ పాల్గొన్నారు.

వరుస చోరీల దొంగ అరెస్టు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన నన్నెపురాజు చంద్రకాంత్ గత కొంతకాలంగా మంచిర్యాల నివాసం ఉంటూ జల్సాలకు అలవాటుపడ్డాడని తెలిపారు. అమ్మాగార్డెన్స్ ఏరియాలోని ఓ ఇంటితోపాటు మల్లిఖార్జుననగర్ ఏరియాలోని మరో ఇంట్లో ఇటీవల చోరీకి పాల్పడి రెండు ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడని పేర్కొన్నారు. బుధవారం క్యాతనపల్లి వద్ద అనుమానాస్పదంగా కనిపించగా విచారణలో దొంగ



అరెస్టయిన నిందితుడితో సీఐ, ఎస్సై

తనం విషయం బయటకు వచ్చిందని తెలిపారు. నిందితుడి నుంచి రెండు ల్యాప్‌ట్యాప్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- గజ్వేల్ సమీపంలో లారీని ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌కు వెళ్లి వస్తుండగా గజ్వేల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫాబాద్ మండలం రహపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రహపల్లికి చెందిన ఆడే తిరుపతి(28), పోశన్న, రాములు కలిసి అనారోగ్యం బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన చిన్మయ గిరిస్వామిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి ఈ నెల 18న కారులో తీసుకెళ్లారు. చిన్మయ గిరిస్వామిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన అనంతరం వీరు ముగ్గురు అదే కారులో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో గజ్వేల్ సమీపంలో ఆగి ఉన్న లారీని వీరు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న తిరుపతి అక్కడికక్కడే మృతి చెందగా.. పోశన్న, రాములు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా.. ఆడే తిరుపతికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



తిరుపతి(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి

సారంగపూర్: మండలంలోని చించోలి(బీ) సమీపంలో గల మహబూబాఘాట్స్ సమీపంలోగల దర్గావద్ద ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి ఆవును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన గ్రామస్తులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధితురాలు తోతాబాయి ఆందోళన చేయగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ సయ్యద్ షెఖ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ అడ్మిషన్లు

నిర్మల్ రూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం నుంచి ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2024 పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 23నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత కళాశాలలో సీటు కోసం వెబ్ ఆప్షన్ పెట్టడానికి కళాశాలలో కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

లింగాపూర్(ఆసిఫాబాద్): ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లాపటార్ గ్రామానికి మహమ్మద్ అప్సర్ (27) గ్రామ శివారులో బుధవారం ట్రాక్టర్‌తో వ్యవసాయ చేను దున్నేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి సమీపంలోని లోయలో బోల్తాపడింది. సమీపంలో ఉన్న అతడి సోదరుడు మహమ్మద్ హాకాని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. లోయ నుంచి అప్సర్‌ను బయటికి తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి సోదరుడు హాకాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళను కొట్టిన కేసులో ముగ్గురికి జైలు

రామకృష్ణాపూర్: మహిళను కొట్టిన కేసులో ముగ్గురికి నెలరోజుల జైలుతోపాటు రూ.వేయి జరిమానా విధిస్తూ మంచిర్యాల ప్రిన్సిపల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ సంపత్ బుధవారం తీర్పునిచ్చినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పులిమడుగు గ్రామానికి చెందిన భూక్య బాబురావు, భూక్య భీమా, భ్యూక్య ప్రవీణ్‌లు అదే గ్రామానికి చెందిన భుక్య లక్ష్మిని 2021 జనవరిలో కొట్టి బెదిరించారని తెలిపారు. ఆర్‌కేపీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, ఈ మేరకు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారని తెలిపారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ మండల కేంద్రంలోని దీక్షిత ఫర్టిలైజర్ షాపులో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో చోరీ జరిగింది. షాపులో నుంచి రూ.2.38 లక్షల నగదు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకుడు కవ్వాల సాయి తెలిపారు. విషయం తెలుసుకున్న కౌటాల సీఐ సాదిక్ పాషా డాగ్స్‌స్క్వాడ్ సాయంతో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ఏఎస్సై మోహన్, కానిస్టేబుల్ విష్ణు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఆదిలాబాద్‌టౌన్: ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కేర్ హాస్పిటల్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి ఎండీ ఆర్.చంద్రకిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యనిపుణులు ఎస్.జగదీశ్వర్, కే. సంకల్ప్, విశ్వనాథ్, డి.సంతోష్, జయ జ్యోతి, రాజేశ్ పాల్గొని 300 మంది పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ స్పెషల్ బ్రాంచ్ పోతారం శ్రీనివాస్, సీఐలు కె.సత్యనారాయణ, డి.సాయినాథ్, ఎ.అశోక్, శ్రీనివాస్,



డీఎస్పీకి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కే.ఫణిధర్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి.మురళి, ఎ.నవీన్ కుమార్, చంద్రశేఖర్, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ శాంతిరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్ కలెక్టర్‌ను కలిసిన ఔట్‌సోర్సింగ్ ప్రతినిధులు

కైలాస్‌నగర్: నిర్మల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దుర్గం శేఖర్ ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 2024-25 కోసం ఎంప్యానల్మెంట్ టెండర్లలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీలకు మాత్రమే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు రుక్మారెడ్డి, బాబాగౌడ్, శ్యాంరావ్, భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతినిధులు

ప్రైవేటు పాఠశాల గోదాం సీజ్

- నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్నారని ఏబీవీపీ ఆందోళన

ఆదిలాబాద్‌రూరల్: మావల పరిధిలోగల న్యూ శ్రీచైతన్య పాఠశాలకు చెందిన పుస్తక గోదాంను అధికారులు బుధవారం సీజ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అధిక ధరలకు పుస్తకాలు విక్రయించేందుకు మావల మండల కేంద్రంలో ప్రత్యేక గోదాం ఏర్పాటు చేశారన్న విషయాన్ని ఏబీవీపీ నాయకులు తెలుసుకున్నారు. వెంటనే అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డీఈవో ప్రణీత అక్కడికి చేరుకున్నారు. సదరు పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసినా ఆయన రాకపోవడంతో మావల పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని డీఈవో సమక్షంలో వాటిని అదుపులోకి తీసుకొని గోదాంకు తాళం వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి, పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

చిన్నారులపై పిచ్చికుక్క దాడి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని సాయినగర్, రాజంపేట కాలనీల్లో బుధవారం పిచ్చికుక్కలు దాడులకు దిగాయి. రాజంపేట కాలనీల్లో ఆరుబయట ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులను ఓ కుక్క గాయపర్చింది. వీరిని కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. తీవ్రంగా గాయపడిన రిషితోపాటు 11 నెలల అయాన్ష్‌ను వైద్యులు మంచిర్యాల ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆశ్విత అనే ఎనిమిదేళ్ల చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా.. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ సిబ్బంది కర్రలతో కుక్కలను తరిమివేసేందుకు చర్యలు చేపట్టారు.



తీవ్రంగా గాయపడిన అయాన్ష్



చిన్నారి చేతిపై గాయం

వైద్యులపై దాడులు సరికాదు

మంచిర్యాలటౌన్: వైద్యులంటే ప్రాణాలు పోసేవారేగానీ ప్రాణాలు తీసేవారు కాదని, అకారణంగా వైద్యులను ఇష్టారీతిన దూషిస్తూ, దాడులు చేసేలా ప్రవర్తించడం సరికాదని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్ఎంవోలు శ్రీమన్నారాయణ, డాక్టర్ భీష్మ, ఎంసీహెచ్ గైనకాలజిస్టులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బెల్లంపల్లికి చెందిన గంగ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసవించిన ఐదు రోజుల తర్వాత నడుం లేవడం లేదని అన్నారని, స్కానింగ్ కోసం తామే పంపిస్తే వివరాలు తెలుసుకోకుండానే నరం కట్ చేశారంటూ తమ వైద్యులపై 50మందికి పైగా ఒకేసారి ఆందోళనకు దిగారని అన్నారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి పంపిస్తే అక్కడి



మాట్లాడుతున్న డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి

వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి ఎలాంటి నరం కట్ కాలేదని, దీర్ఘకాలిక వ్యాధులు ఆపరేషన్ సమయంలో ఇలా బయటపడతాయని చెప్పారని, ప్రస్తుతం గంగ కోలుకుంటోందని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యులు నాగసింధు, అలివేణి, కీర్తిశ్రీ, ప్రశాంతి, ప్రసన్న, గణేష్ పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్-2025(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బి.వినోద్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు జి.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 18 నుంచి ఏప్రిల్ 18, 2025 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, జూలై 3లోగా హైదరాబాద్‌లోని సైదాబాద్, లక్ష్మీనగర్ కాలనీలో టీజీబీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 మంది ప్రతిభావంతులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 08732-221280 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఐటీఐలో సర్వే పనులు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రభుత్వం ఐటీఐ ఆధునీకరణలో భాగంగా బుధవారం మంచిర్యాల ఐటీఐలో సర్వే పనులు ప్రారంభించారు. అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ కోసం పనులు చేపట్టారు. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంటు(డీజెడ్ఎం) వై.ఉమామహేశ్వర్, కాంట్రాక్టర్ వేణు సర్వే చేశారు. పనులు పూర్తయితే భవనాలు, ఇతర ఆధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయని ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు.



కలెక్టరేట్ ఆవరణలో పార్కింగ్ స్థలం లేక క్యాంటీన్ ఎదుట వాహనాలు నిలుపుతున్నారు. కొందరు ఉద్యోగులు వారి వాహనాలను వరండాలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో కార్యాలయంలోకి వెళ్లాలంటే జనం ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారుల స్పందించి క్యాంటీన్ ఎదుట పార్కింగ్ స్థలాన్ని నిషేధించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

